న్యూస్‌రీల్

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

మంచిర్యాలఅర్బన్: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 3నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏడేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పగించిందని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని తెలంగాణ అమలు చేయవద్దని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

నిధులు కేటాయించాలి

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వ ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30శాతం నిధులను కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

చెన్నూర్: మండలంలోని అస్నాద్ గ్రామానికి చెందిన గుడిసెల పోసుకు రూ.18వేలు, గుడిమల్ల రాజంకు రూ.20వేల చొప్పున సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీపీ మంత్రి బాపు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న పోసు, రాజంలు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ దృష్టికి తీసుకువెళ్లగా వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోతె తిరుపతి, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు సమ్మిరెడ్డి, మండల నాయకులు ఏలేశ్వరం నరసింహచారి పాల్గొన్నారు.

భీరన్న దేవుడి పండుగ



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

భీమిని: మండల కేంద్రంలో గొల్లకుర్మల ఆరాధ్య దైవం భీరన్న దేవుడి పండుగ ఘనంగా నిర్వహించారు. బుధవారం భీరన్న దేవుడి నాగవెల్లి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్‌యాదవ్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, గొర్రెలు, మేకల వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు పోశన్న కల్యాణి, చిన్న ఐలయ్య పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష

జైపూర్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గ్రామ పంచాయతీలో 30మందికి తక్కువ కాకుండా ఉపాధి హామీ పనులు కల్పించాలని, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలకు ప్రతి రోజు నీరు అందించాలని తెలిపారు. ఆదేవిధంగా చనిపోయిన పెన్షన్‌దారుల వివరాలను ప్రతి నెలా ఒకటో తేదీలోగా ఎంపీడీవో కార్యాలయంలో అందించాలన్నారు. గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో బాలయ్య, ఈసీ రాజమొగిలి పాల్గొన్నారు.

దుబాయ్‌లో ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న భూమన్న

జన్నారం: తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి 4వ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ వాసులు ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమన్న ఆధ్వర్యంలో దుబాయ్‌లో బుధవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భూమన్న మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ. 500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుబాయ్ శాఖ అధ్యక్షులు ఆలీం, కో ఆర్డినేటర్ రమేష్, నర్సయ్య, సంఘ సమితి నాయకులు సత్తన్న, రాంరెడ్డి, సాయికుమార్, రామన్న, పరమేష్ పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 కాలనీలోని గీతా ప్రశాంతి నిలయం 31వ వార్షికోత్సవంలో భాగంగా భీష్మ ఏకాదశిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 18 హోమ గుండాలచే గీతా హవన యజ్ఞం నిర్వహించారు. గీతా సత్సంగం అధ్యక్షులు దాసరి రాజేశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో గీతా సత్సంగంకు చెందిన దుర్గా ప్రసాద్, ఆర్ మల్లేశ్, కె రాజమౌళి, సీహెచ్ రాంబాబు, టీ మనోహర్, హైమావతి, అరుణ పాల్గొన్నారు.

దళారుల జోరు... పత్తి రైతుల బేజారు



పత్తిని లోడ్ చేస్తున్న కూలీలు

నెన్నెల: పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు పండించిన పంటను ఇళ్లల్లోనే భద్రపర్చుతున్నారు. కొందరు రైతులు పత్తి చేళ్లలోనే ఉంచుతున్నారు. రోజుల తరబడి ఇంట్లో నిల్వ ఉండడంతో పత్తి రంగు మారుతోంది. రంగు మారిన పత్తికి కనీస ధరలు కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది ఏమి లేక తప్పని పరిస్థితుల్లో దళారులకు విక్రయిస్తే తీవ్రంగా నష్టపోతున్నారు. ఇష్టారీతిలో గ్రామాల్లోకి వాహనాలను తీసుకొచ్చి దళారులు జోరుగా పత్తి వ్యాపారాన్ని సాగిస్తున్నా.. చర్యలు తీసుకునే వారే కానరావడం లేదు. పంట పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చేందుకు రైతులు నష్టానికి సైతం అమ్ముకోక తప్పడం లేదు. ఇదే అదునుగా భావించిన మహారాష్ట్ర, స్థానిక దళారులు కలిసి రైతులను మోసం చేస్తున్నారు.

అనుమతులు లేవు...

మండలాల్లో పత్తి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఇష్టారీతిన పత్తి దందాను సాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేయడంతో పాటు క్వింటాల్ పత్తికి 2 నుంచి 3 కిలోల చొప్పున కటింగ్ చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. డబ్బులు సైతం వెంటనే చెల్లించడం లేదని, వాయిదాలు పెడుతున్నారని పేర్కొంటున్నారు. అనుమతులు లేకుండా ఈ వ్యాపారం చేస్తున్న వారిపై ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు పేర్కొంటున్నారు.

మామడ గ్రామస్తులకు ఎమ్మెల్యే భరోసా



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు మట్టి కట్ట కింద ఇబ్బందులు పడుతున్న మామడ గ్రామస్తులకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భరోసా ఇచ్చారు. 31వ తేదీన 'సాక్షి'లో నీల్వాయి నిండా ముంచుతోంది అనే కథనానికి ఎమ్మెల్యే చిన్నయ్య స్పందించారు. గ్రామస్తులను బెల్లంపల్లిలోని క్యాంపు ఆఫీస్‌కు పిలిపించుకుని వారి ఇబ్బందులపై చర్చించారు. పంచాయతీరాజ్ , ఇరిగేషన్ ఈఈలతో మాట్లాడారు. వారం రోజుల్లో వారి గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేలా అధికారులతో మాట్లాడుతానన్నారు. అదే విధంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల టెండర్ ప్రక్రియలో ఉండగా వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇప్పించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గోర్క రాజన్న, లింగరాజు, మంకయ్య, వెంకన్న, ఐలయ్య, మహేష్, శంకర్ , రాజన్న ఉన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

బెల్లంపల్లి: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. బుధవారం కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లను అందజేసి మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సీఓఈ విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతోందని వివరించారు.

ఐక్యంగా ఉండాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: నేతకానియులు శ్రేయస్కర కార్యక్రమాలను విస్తృతం చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏఎంసీ ఏరియా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం (టీఎస్‌ఎంవీఎస్) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర సోషల్‌మీడియా కార్యదర్శి బోర్లకుంట రాజేశ్‌నేత , బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు దుర్గం బానుప్రసాద్ ఉన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని చిన్నయ్య సందర్శించారు. సంపూర్ణ ఆరోగ్య రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని సమస్యలు ఉన్న వారు అద్దాలు తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ అశోక్, హెచ్‌ఈవో సమ్మయ్య, సిబ్బంది అలేఖ్య, శివగణేష్, ఉమారాణి, చంద్రకళ, మంగావతి, వెంకటలక్ష్మి, రాజేశ్వరి ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ 20వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతతో కలిసి ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కౌన్సిలర్ గోసిక రమేష్, కంటి వెలుగు వైద్యులు, సిబ్బంది బీఆర్‌ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, శ్రేణులు యాదగిరి, కిరణ్, శ్రీధర్, భీమాగౌడ్ ఉన్నారు.

రాముని చెరువును శుద్ధి చేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు దుర్గంధం వెదజల్లుతోందని, వెంటనే శుద్ధి చేయాలని బుధవారం సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం అధ్యక్షులు గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ చెరువులో నిల్వ ఉన్న మురుగునీటిని డివాటర్ చేయాలని, చెరువులో పూడిక తీయాలని కోరారు. కార్యక్రమలలో రాముని చెరువు వాకర్ సభ్యులు, సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం నాయకులు చిప్ప రామస్వామి, గోపతి లక్ష్మణ్, మోహన్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం శ్రీనివాస్

మందమర్రిరూరల్: ఎస్సై, కానిస్టేబుల్ రాత పరీక్ష కోసం సిద్ధపడుతున్న అభ్యర్థులు సింగరేణి ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఏరియాలోని సీఐఎస్‌ఎఫ్ బ్యారక్ ఆవరణలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని జీఎం ప్రారంభించారు. ఆయన వెంట జీఎం ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్, సీనియర్ పర్సనల్ మేనేజర్ ఆసీఫ్, సంఘమిత్ర యూనియన్ ప్రతినిధులు సంపత్, సత్యనారాయణ ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యం

బెల్లంపల్లి: దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌ను తయారు చేసిందని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ అన్నారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు ఊతమిచ్చేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్‌ను తయారు చేయడం అభినందనీయమన్నారు. ఎంతో ముందుచూపుతో బడ్జెట్‌ను తయారు చేశారని, ఆదాయ పరిమితిని రూ.7లక్షలకు పెంచి ఉద్యోగులకు భారీ ఊరడింపు ఇచ్చారని వివరించారు. సమావేశంలో నాయకులు తిరుపతి, కేశవరెడ్డి , గోవర్ధన్ , శ్రీనివాస్, రాజులాల్ యాదవ్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు కొత్త శోభ



జన్నారం: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్



తాండూర్: పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

- మన ఊరు – మన బడి పథకంలో పూర్తయిన పనులు
- పలుచోట్ల ప్రారంభించిన ఎమ్మెల్యేలు

జన్నారం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ మన ఊరు – మన బడి పథకం ప్రారంభించి పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ తెలిపారు. బుధవారం జన్నారం మండల కేంద్రంలోని పొన్కల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మన ఊరు – మన బడి పథకం కింద పనులు పూర్తి చేసుకోవడంతో పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుడి వరకు సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. విద్యార్థుల చదువుల కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారని, ఇప్పుడు ప్రభుత్వ బడులను అభివృద్ధిలోకి తీసుకువస్తున్నారని వివరించారు. అనంతరం పొన్కల్ గ్రామంలో దళిత బంధు పథకంపై అవగాహన కల్పించారు. తపాలాపూర్ గ్రామంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, ఏఎంసీ చైర్మన్ పద్మ, పీఏసీఎస్ చైర్మన్ శీలం రమేష్, ఎంఈవో విజయ్‌కుమార్, ఎంపీడీవో అరుణ రాణి, రైతుబంధు సమితి అధ్యక్షులు రాజారాం రెడ్డి, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ ఆలీఖాన్, పొన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, తిమ్మాపూర్ సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీలు రియాజొద్దీన్, వెంకటస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేష్ యాదవ్, డైరెక్టర్లు భరత్‌కుమార్, కాంతమణి, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

బెల్లంపల్లి: విద్యారంగాన్ని బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి మున్సిపాలిటీ 5 వార్డు నంబర్ –2 ఇంక్‌లైన్ బస్తీలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.32.11 లక్షల అంచనాతో ఆధునీకరించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వరాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కేజీ నుండి పీజీ విద్యను ఉచితంగా అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కౌన్సిలర్లు విజయ తిరుమల, గోసిక రమేష్, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లల్లో నాణ్యమైన విద్య

తాండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం తాండూర్ మండలం గోపాల్‌నగర్‌లో మన ఊరు మన బడి కార్యక్రమంలో రూ.25.66 లక్షల అంచనాతో ఆధునీకరించిన మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. గోపాల్‌నగర్ సర్పంచ్ బక్కమ్మ, జిల్లా సెక్టోరల్ అధికారి సఫ్దర్‌అలీ ఖాన్, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య, ఎంఈవో వాసాల ప్రభాకర్, సింగిల్ విండో చైర్మన్ దత్తుమూర్తి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

సమ్మక్క–సారక్క జాతర



జైపూర్: మండల కేంద్రంలోని వెలిశాల మల్లన్న స్వామి ఆలయ సమీపంలోని సమ్మక్క–సారక్క జాతర బుధవారం ప్రారంభమైంది. ప్రతి ఏటా సమ్మక్క–సారక్క తల్లులకు స్థానిక పరిసర ప్రాంత భక్తులు మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా బుధవారం జైపూర్ పరిసర గ్రామాల భక్తులు సమ్మక్క–సారక్క తల్లులను దర్శించుకుని బంగారం(బెల్లం) పంచి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో అటవీప్రాంతం సందడిగా మారింది.

పశువులకు టీకాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: పాడిరైతులకు పశువులు, గేదెలకు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వై.రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రెండ వార్డు దొరగారిపల్లిలో టీకాలు వేశారు. ఈ నెల 5 వరకు టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



దండేపల్లి: ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తున్నారని, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలను తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డులో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి కాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మోతె సుజాత, పడాల మాధవి, పడాల రామన్న, పడాల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

24గంటల కరెంటు ఘనత కేసీఆర్‌దే

దండేపల్లి: 24 గంటల కరెంటు ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి 24గంటల సింగిల్‌ఫేస్ విద్యుత్ సరఫరా అందించేదుకు వెల్గనూర్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఫీడర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కరెంటు కష్టాలు తొలగాయన్నారు. కార్యక్రమంలో రైతు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, సర్పంచ్ శంకరయ్య, ఉప సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యురాలు మల్లవ్వ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఏబీవీపీ నాయకులపై దాడి హేయమైన చర్య

చెన్నూర్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే ఇవ్వాలని కరీంనగర్ పర్యటనకు వచ్చి కేటీఆర్‌ను ప్రశ్నిస్తే ఏబీవీపీ నాయకుల పై దాడి చేయడం హేయమైన చర్య అని, దాడిని ఏబీవీపీ పక్షాన ఖండిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత అన్నారు. విద్యార్థి నాయకుని పై దాడిని నిరసిస్తూ బుధవారం పట్టణంలో విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, పట్టణ కార్యదర్శి తిరుపతి, సాయితేజ, మంగ, శివకుమార్, శ్రావణిలు పాల్గొన్నారు.

పింఛన్ సౌకర్యం కల్పించాలని వినతి

చెన్నూర్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ లాభాలు, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు వాట్సాప్ ద్వారా వినతి పత్రాన్ని పంపించినట్లు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తరువాత ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శారద పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చెన్నూర్‌రూరల్: మందమర్రిలో జరిగే గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని దుగ్నెపల్లి గ్రామంలో జెడ్పీటీసీ మోతె తిరుపతి, నాయక్‌పోడ్ సేవా సంఘం నాయకులు బుధవారం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిస్కుల లక్ష్మణ్, నాయకులు పెద్ది శ్రీకాంత్, రమేష్, సంపత్, పవన్, మధుకర్, రమేష్ పాల్గొన్నారు.

స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడాలి

పాతమంచిర్యాల: మహిళలు స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలికల వసతి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో సంపూర్ణ స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛను మహిళలు అనుభవించలేకపోతున్నారన్నారు. వార్డెన్ సునీత రాణి, శ్యామల, వైజా, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీకాంత్ ఉన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

వేమనపల్లి: ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో లక్ష్మయ్య సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధార్ నమోదుతో పాటు మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ మధుకర్, టీఏలు పాల్గొన్నారు.

నూతన సంచాలకులకు అభినందనలు

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు నూతన సంచాలకులుగా ఎంపికైన వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), ఎన్‌వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్) లకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో నూతన సంచాలకుల ఎంపిక పకడ్బందీగా జరిగిందని దీంతో సింగరేణి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

ఒత్కులపల్లిలో కంటివెలుగు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఒత్కులపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణ సాగర్‌రావు కంటి పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ మాడ సుమలత, మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ సమ్మిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5బి గనిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను సన్మానించారు. గనిపై జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు గోగుల రాజయ్య(టిండాల్), తాసి రవీందర్(సపోర్టుమెన్), ఆకిరెడ్డి లింగయ్య(జనరల్ మజ్దూర్)లను గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్‌లు ఘనంగా సన్మానించారు. గని సంక్షేమ అధికారి రణదీప్ అసిస్టెంట్ ఇంజినీర్ రాందాస్, ఇంజినీర్ సందీప్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ సదయ్య పాల్గొన్నారు.

మిషన్ భగీరథ మెటీరియల్ మాయం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ఒర్రెగడ్డ ప్రాంతంలో నిల్వ ఉంచిన మిషన్ భగీరథ పనులకు సంబంధించిన రూ.12లక్షల విలువైన లీకేజీ మెటీరియల్ మాయమైనట్టు సబ్ కాంట్రాక్టర్ వేల్పుల కిరణ్ రెండు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మిషన్ భగీరథ పనుల్లో సామగ్రి చోరీకి గురైన దానిపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బుధవారం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు మందమర్రి పట్టణ సీపీ కార్యదర్శి దుర్గరాజ్ ఫిర్యాదు చేశారు.

మైసమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలించిన సీఐ



జాతర స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లాలో నిర్వహించనున్న గాంధారి మైసమ్మ జాతర ఏర్పాట్లను మందమర్రి సీఐ ప్రమోద్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ నెల 3, 4, 5 తేదీలలో నిర్వహించే జాతరకు లక్షలాది సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. సీఐ మాట్లాడుతూ ఆదివాసీ నాయక్‌పోడ్‌లు నిర్వహించే మైసమ్మ జాతరకు చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.